క్లుప్తంగా

మద్దిలేటయ్యను దర్శించుకున్న ఎమ్మెల్యే కాటసాని

బేతంచెర్ల: మండల పరిధిలో వెలసిన శ్రీ మద్దిలేటిస్వామిని శనివారం బనగానపల్లె ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి దర్శించుకున్నారు. ఈఓ పాండు రంగారెడ్డి, చైర్మన్ రామ చంద్రుడు, వేదపండితులు జ్వాలా చక్రవర్తి, కల్యాణ చక్రవర్తి ఆలయ మర్యాదలతో ఎమ్మెల్యేకు స్వాగతం పలికి, స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజల అనంతరం తీర్థ ప్రసాదాలు అందజేసి సత్కరించారు. అనంతరం సుమారు రూ.4 కోట్లతో నిర్మిస్తున్న ఆలయ పునర్నిర్మాణ పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. కార్యక్రమంలో అవుకు మండలం వైఎస్సార్‌సీపీ కన్వీనర్ కాటసాని తిరుపాల్ రెడ్డి, నాయకులు యమసాని రామ మహేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వాసవీ మాతకు ఊయల బహూకరణ


ఊయల అందజేస్తున్న దాతలు

బేతంచెర్ల: పట్టణంలోని అమ్మవారిశాలలో వెలసిన వాసవీమాతకు పవ్వలింపు సేవకు దాతలు కందగడ్డల రామూర్తి, లలితమ్మ దంపతులు రూ.75 విలువ టేకు ఊయలను శనివారం బహూకరించారు. ప్రత్యేక పూజల అనంతరం ఆర్యవైశ్య సంఘం అధ్యక్ష, కార్యదర్శులు గుండాగోపాలు, బచ్చు సుబ్రహ్మణ్యం దాతలకు అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందజేసి సత్కరించారు.

7 నుంచి టంగుటూరు పెద్దమ్మ దేవర



బనగానపల్లెరూరల్: మండలంలోని టంగుటూరులో వెలసిన పెద్దమ్మ దేవర ఈ నెల 7,8వ తేదీల్లో దేవర నిర్వహిస్తున్నట్లు గ్రామ రైతు సంఘం పెద్దలు తెలిపారు. 7వ తేదీ మంగళవారం అర్ధరాత్రి నుంచి పెద్దమ్మ విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు, 8న అమ్మవారికి నైవేద్యంగా బోనాల సమర్పణ తదితర కార్యక్రమాలు ఉంటాయన్నారు. భక్తులు తరలివచ్చి అమ్మవారి దీవెనలు పొందాలని కోరారు.

వైఎస్సార్ బీమా సాయం అందజేత


బాధితురాలికి నగదు అందజేస్తున్న నాయకులు

ప్యాపిలి: స్థానిక బీసీ కాలనీకి చెందిన వడ్డే గణేశ్ కొద్ది రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. బాధిత కుటుంబానికి వైఎస్సార్ బీమా కింద ప్రభుత్వం తక్షణ సాయంగా రూ. 10వేలు మంజూరు చేసింది. ఈ మేరకు శనివారం నగదును మృతుడి భార్య అమరేశ్వరికి జెడ్పీటీసీ బోరెడ్డి శ్రీరామిరెడ్డి, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మెట్టు వెంకటేశ్వర్ రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ బొర్రా మల్లికార్జునరెడ్డి తదితరులు అందజేశారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు మాజీ వైస్ చైర్మన్ చంద్రశేఖర్ రెడ్డి, వెల్ఫేర్ అసిస్టెంట్ ఓబయ్య, పీఎస్ కిరణ్మయి, వలంటీర్ జ్యోతిర్మయి తదితరులు పాల్గొన్నారు.

భగవద్గీత పఠనం అలవర్చుకోవాలి


విజేతలకు మెమొంటోలు అందజేసిన దృశ్యం

డోన్ : భగవద్గీతను నిత్యం పఠిస్తే జీవిత సారాంశం తెలియవస్తుందని ఇన్నర్‌వీల్‌క్లబ్ అధ్యక్షురాలు ఆర్‌టీసీ శాంతి అన్నారు. స్థానిక ఫోటాన్ ఇన్‌స్టిట్యూట్‌లో ఇన్నర్‌వీల్ క్లబ్ ఆధ్వర్యంలో భగవద్గీత శ్లోకాల పఠనం పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు న్యాయ నిర్ణేతలుగా పట్టణ ప్రముఖులు చక్రపాణి, ఎల్కూరు నరేష్ వ్యవహరించారు. ఆసక్తికరంగా జరిగిన ఈ పోటీల్లో మొదటి, రెండవ, మూడవ, నాల్గవ స్థానాల్లో వరుసగా అమీర్‌బాషా, కరుణాకర్, కార్తీక్, మహేష్ నిలిచారు. ఫోటాన్ ఇన్‌స్టిట్యూట్ అధినేత సాయినాథ్, స్మిత దంపతులు, ఇన్నర్‌వీల్‌క్లబ్ సభ్యులు అనురాధ, విజయలక్ష్మి విజేతలకు మెమొంటోలు అందజేసి సత్కరించారు.

నాడు-నేడు పనుల పరిశీలన

బేతంచెర్ల: పట్టణంలోని హనుమాన్ నగర్ జెడ్పీ హైస్కూల్‌లో జరుగుతున్న నాడు-నేడు సెకండ్ ఫేస్ కింద జరుగుతున్న అభివృద్ధి పనులను ఎంఈఓ సోమశేఖర్ శనివారం పరిశీలించారు. 19 గదులు, స్లాబ్ నిర్మాణాలను హెచ్ఎం రాజశేఖర్ రెడ్డితో కలిసి ఆయన తనిఖీ చేశారు. పనులను నాణ్యతగా చేపట్టాలని కంట్రాక్టర్‌కు ఎంఈఓ సూచించారు.

అప్రమత్తత ఏదీ ?

- గని కార్మికులకు కరువైన భద్రత
- నిత్యం ప్రమాదాలకు గురువుతున్న శ్రమజీవులు
- ప్రాణాలు కోల్పోతున్నా స్పందించని గనుల యాజమాన్యాలు, అధికారులు


గనుల్లో ఏర్పాటు చేసిన ట్రాన్స్ ఫార్మర్లు


విద్యుత్ కోత మిషన్ సాయంతో పనులు చేస్తున్న కార్మికులు (ఫైల్)

కొలిమిగుండ్ల: నాపరాళ్ల చరిత్ర ఎళ్లలు దాటినా కార్మికుడి జీవితానికి భద్రత కరువైంది. వ్యాపారులు, గనుల యాజమాన్యాలు ఆర్థికంగా అభివృద్ధి చెందినా కష్టజీవులకు మాత్రం కనీస వసతులు కరువయ్యాయి. దీంతో నాపరాతి గనుల్లో విద్యుత్ కోత మిషన్‌లు కార్మికులను పొట్టన పెట్టుకుంటున్నాయి. విద్యుత్ షాక్‌తో నిమిషాల్లో మృత్యువాత పడుతున్నారు. నంద్యాల జిల్లాలో కొలిమిగుండ్ల, అవుకు, బనగానపల్లె, బేతంచెర్ల మండలాల్లో విస్తారంగా నాపరాతి గనులు ఉన్నాయి. దాదాపు 1105 హెక్టార్లలో గనులు విస్తరించి ఉన్నాయి. 30వేల మందికి పైగానే దినసరి కూలీలుగా పని చేస్తుంటారు. నాపరాతి గనుల్లో పని చేయడం ప్రతి రోజు సవాల్‌తో కూడుకున్నది. మొదట్లో గనుల్లో వివిధ సైజుల్లో రాళ్లను వెలికితీయాలంటే కార్మికుల మీదనే ఆధారపడి ఉండేది. కాలక్రమేనా డీజిల్‌తో పనిచేసే కోత మిషన్‌లు అందుబాటులోకి వచ్చాయి. అనంతరం విద్యుత్ కోత మిషన్‌లపై యజమానులు ఆసక్తి చూపారు. బనగానపల్లె, డోన్ నియోజకవర్గాల్లో సుమారు 3వేల మేర విద్యుత్ కోత మిషన్‌లతో పనులు చేస్తున్నారు కార్మికులు. నిత్యం భయ.. భయంగా పనులు సాగిస్తున్నారు. పొట్ట కూటి కోసం ఇంటి నుంచి గని పనికి వెళ్తున్న కార్మికులు క్షేమంగా తిరిగి వచ్చేవరకు భరోసా లేని పరిస్థితి నెలకొంది. తరచూ విద్యుత్ కోత మిషన్‌ల వద్ద ప్రమాదాలు చోటు చేసుకోవడంతో ఏటా పదుల సంఖ్యలో కార్మికులు విద్యుదాఘాతానికి బలవుతున్నారు. ఆయా కార్మికుల కుటుంబాల్లో చీకట్లు అలుముకుంటున్నాయి. ప్రమాదాలు సంభవించిన సమయంలో యజమాన్యాలు నామమాత్రంగా ఆర్థిక సాయం చేసి చేతులు దులుపుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఫిబ్రవరి 28న బెలుం గ్రామానికి చెందిన ఓ యువకార్మికుడు కోతమిషన్‌తో పనిచేస్తూ విద్యుత్ షాక్‌గురై మృతి చెందిన విషయం తెలిసిందే. ప్రతియేటా కనీసం 10 మంది కార్మికులు మృతి చెందుతున్నారని అంచనా. గని పనులు చేస్తూ ఎంతో మంది వికలాంగులై దుర్భర జీవితాలు గడుపుతున్నారు.

ఏ మాత్రం కనిపించని భద్రత

నాపరాతి గనులు, పాలిష్ మిషన్‌ల వద్ద ఏ మాత్రం భద్రత కనిపించడం లేదన ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఏళ్ల కింద ట్రాన్స్ ఫార్మర్‌లు, సక్రమంగాలేని వైరింగ్ మూలంగా తరుచూ విద్యుత్ ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. విద్యుత్ కోత మిషన్‌లతో పని చేసే సమయంలో కార్మికులకు ఎలాంటి సేఫ్టీ పాటించక పోవడం మూలంగా ప్రాణాలు కోల్పోతున్నారు. అదేవిధంగా అధికారులు, గనుల యజమానులు, కార్మికులకు కనీస అవగాహన కల్పించలేక పోతున్నారనే విమర్శలు లేకపోలేదు. కోత మిషన్‌తో నాపరాళ్లు కటింగ్ చేసే సమయంలో బూట్లు,సేఫ్టీ గ్లౌజులు తప్పనిసరిగా వాడాల్సి ఉంది. అయితే ఏవీ లేకుండానే కూలీలు పని చేస్తుంటారు. రాయిని కోత కోసే సమయంలో కాళ్ల కింద నీరు ఉంటుంది. ఈ సమయంలో మిషన్‌కు విద్యుత్ సరఫరా చేసే వైర్ సక్రమంగా లేకపోతే భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుంది. నిమిషాల్లో ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు ఉన్నాయి. బూట్లు, గ్లౌజులు ఉంటే చిన్న పాటి గాయాలతో బయట పడే అవకాశం ఉంది. అదేవిధంగా ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ఎర్తలు ఏర్పాటు చేయడంలోనూ నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తుంది. ట్రాన్స్‌ఫార్మర్ నుంచి కోత మిషన వరకు ఉండే తీగలు చాలా చోట్ల దెబ్బతిని ఉంటాయి. కోత మిషన్‌కు అమర్చే మోటర్‌తో పాటు ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఎంసీబీ స్విచ్ అమర్చుకుంటే కార్మికులు విద్యుత్‌షాక్‌కు గురైన వెంటనే విద్యుత్ ట్రిప్ అవుతుంది. దీని వల్ల ప్రమాదం నుంచి బయట పడొచ్చు. ఇవేవి గనుల యజమాన్యాలు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. అధికారులు కూడా తమకు పట్టనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు లేకపోలేదు.

భద్రత లేక చనిపోతున్నారు



గనుల్లో పని చేసే కార్మికులకు భద్రత లేక చాలా మంది చనిపోతున్నారు. బెలుంలో ఇలా వరుస సంఘటనలు జరుగుతున్నాయి. కార్మికులు కుటుంబాలు దిక్కుతోచని స్థితిలో పడుతున్నారు. యజమానులు అరకొర సాయం ఇచ్చి పట్టించుకోవడం లేదు. కరెంట్ కోత మిషన్‌ల వద్ద పని చేయాలంటే కార్మికులకు సవాల్‌తో కూడుకున్న పని. షాక్ గురికాగానే నిమిషాల వ్యవధిలోని మృత్యువాత పడుతున్నారు.

– సుబ్బరాయుడు, గని కార్మిక సంఘం నాయకుడు,బెలుం

అవగాహన కల్పిస్తున్నాం



నాపరాతి గనుల్లో విద్యుత్ ప్రమాదాలు చోటు చేసుకోకుండా యజమానులు, కార్మికులకు అవగాహన కల్పిస్తున్నాం. పని చేసే సమయంలో ఎలాంటి సేఫ్టీ పద్ధతులు పాటించక పోవడం మూలంగా ప్రమాదాల బారిన పడుతున్నారు. గనుల వద్దకు మీటర్ రీడింగ్ వెళ్లిన సమయంలో భయమేస్తుంటుంది. కార్మికులు తప్పక బూట్లు, గ్లౌజులతో పాటు ఎంసీబీ స్విచ్‌లు అమర్చుకుంటే భద్రత ఉంటుంది.

– ఫక్కీరయ్య, విద్యుత్ శాఖ ఏఈ

నేడు ఎంపీటీసీ సభ్యుల సమావేశం

బనగానపల్లె: పట్టణంలోని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి స్వగృహంలో ఆదివారం నియోజకవర్గంలోని ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యుతో సమావేశం నిర్వహిస్తున్నట్లు జిల్లా వైఎస్సార్‌సీపీ ప్రచార కార్యదర్శి సిద్దంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. సమావేశానికి ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు. స్థానిక సంస్థల ఎమ్మెల్సీ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి డాక్టర్ మధుసూదన్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించే అంశంపై ఎమ్మెల్యే చర్చిస్తారని ఆయన వివరించారు.

ఓటర్ స్లిప్పుల పంపిణీ ప్రారంభం

కొలిమిగుండ్ల: పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఓటర్ స్లిప్పుల పంపిణీ శనివారం నుంచి ప్రారంభించినట్లు తహసీల్దార్ దోనీ ఆల్‌ఫ్రెడ్ తెలిపారు. మండలంలో 1021 మంది పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటర్లు, 66 మంది ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటర్లు ఉన్నారన్నారు. ఈనెల 13న జరిగే ఎమ్మెల్సీ ఎన్నికలకు కొలిమిగుండ్ల ఉన్నత పాఠశాలలో రెండు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ఓటర్ స్లిప్పుల పంపిణీని త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకున్నామన్నారు.

భక్తులతో కిటకిటలాడిన శ్రీ మద్దిలేటయ్య ఆలయం

బేతంచెర్ల: మండల పరిధిలో వెలసిన శ్రీ మద్దిలేటి నరసింహస్వామి ఆలయం శనివారం భక్తజనంతో కిక్కిరిసిపోయింది. జిల్లా నలుమూలల నుండే కాకుండా, తెలంగాణా, కర్ణాటక రాష్ట్రాల నుండి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. వేకువజామున ఆలయ పుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరించి స్వామి, అమ్మవార్లకు అభిషేకం, ఆకుపూజ, కుంకుమార్చన, మహామంగళహారతి, వరపూజ నిర్వహించి మొక్కులు చెల్లించారు. సేవా టికెట్స్, లడ్డు ప్రసాదం, గదుల బుకింగ్, అన్నదానం చందాలు, గండదీపం, విరాళాలు, కళ్యాణ కట్ట తదితర సేవల ద్వారా రూ. రూ.5,40,437 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ పాండు రంగారెడ్డి, ఆలయ చైర్మన్ సీతారామచంద్రుడు తెలిపారు.

బైపాస్ రోడ్డు భూసేకరణకు సహకరించాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ వెంకటరెడ్డి

బనగానపల్లెరూరల్: బనగానపల్లె పట్టణంలో బైపాస్ రోడ్డు నిర్మాణం కోసం చేపట్టే భూ సేకరణకు రైతులు సహకరించాలని ఆర్డీఓ వెంకటరెడ్డి కోరారు. స్థానిక పాదుపు భవనంలో తహసీల్దార్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో బైపాస్ రోడ్డు నిర్మాణం కోసం భూములు కొల్పోతున్న బనగానపల్లె, బత్తులూరుపాడు, భానుముక్కల, మిట్టపల్లె గ్రామాలకు చెందిన రైతులతో ఆర్డీఓ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బైపాస్ రోడ్డు నిర్మాణం ప్రజా ప్రయోజనల కోసం చేపట్టడడం జరిగిందన్నారు. రైతుల నుంచి 2013 చట్ట ప్రకారం భూ సేకరణ జరుగుతుందన్నారు. మొత్తం 88 మంది రైతుల నుంచి 33.57 ఎకరాలు భూమిని సేకరిస్తామన్నారు. ప్రభుత్వ నిబంధల మేరకు ధర చెల్లించడం జరుగుతుందని వివరించారు. పలువురు రైతులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. రైతులు తెలిపిన అభిప్రాయలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి మరోసారి సమావేశం అవుతామని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ రాఘవేంద్ర ప్రసాద్, మండల సర్వేయర్ గీతాగాయత్రి, వీఆర్‌ఓలు గుడిసె గోపాల్, అబ్దుల్లా, ఈశ్వర్, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

వైద్యుల సూచనలు పాటించాలి


టీకా కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న మల్లికార్జునరెడ్డి

బనగానపల్లెరూరల్: గర్భిణులు, బాలింతలు వైద్యుల సూచనలు, సలహాలను తప్పనిసరిగా పాటించాలని జిల్లా ఇమ్యూనైజేషన్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ మల్లికార్జునరెడ్డి సూచించారు. శనివారం టంగుటూరు పీహెచ్‌సీ పరిధిలోని అప్పలాపురం గ్రామ అంగన్‌వాడీ కేంద్రంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శివశంకరుడు ఆధ్వర్యంలో జరుగుతున్న ఇమ్యూనైజేషన్ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. డాక్టర్ మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ పుట్టిన బిడ్డ నుంచి ఐదేళ్ల వయస్సు లోపు చిన్నారులందరికీ తప్పనిసరిగా వ్యాధి నిరోధక టీకాలు వేయించాలన్నారు. అనంతరం పీహెచ్‌సీ పరిధిలోని చిన్నారులు, గర్భిణులు, బాలింతల వివరాలకు సంబంధించి రికార్డుల ను ఆయన తనిఖీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ సోహైల్‌బాబు,ఎంపీహెచ్‌ఓ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

దొంగతనాలపై అప్రమత్తంగా ఉండాలి

కోవెలకుంట్ల: స్థానిక పోలీస్ సర్కిల్ కార్యాలయ పరిధిలో ఇటీవల జరిగిన దొంగతనాలను దృష్టిలో ఉంచుకుని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీఐ నారాయణరెడ్డి సూచించారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సర్కిల్ పరిధిలోని సంజామల, కానాల, దొర్నిపాడు మండలం గుండుపాపల, తదితర గ్రామాల్లో ఇళ్లకు తాళం వేసిన ఇళ్లను టార్గెట్ చేసి దొంగలు చోరీలకు పాల్పడ్డారన్నారు. పగటి వేళల్లో రెక్కీ నిర్వహించి పండగలు, జాతరలు, శుభకార్యాలయాలకు కుటుంబ సమేతంగా తాళం వేసి వెళ్లిన ఇళ్లను గుర్తించి దుండగులు దొంగతనాలకు పాల్పడుతున్నారన్నారు. ఇళ్లకు తాళం వేసి వెళ్లే వ్యక్తులు ముందస్తుగా పోలీసులకు సమాచారం ఇస్తే ఆ ఇళ్లపై నిఘా ఏర్పాటు చేస్తామని తెలిపారు. బంగారు ఆభరణాలు, విలువైన వస్తువులు, నగదును ఇళ్లలో ఉంచుకోకుండా లాకర్లలో భద్రపరుచుకోవాలని సూచించారు.

ముద్దాయిలు సత్ప్రవర్తనతో మెలగాలి


సదస్సులో మాట్లాడుతున్నజడ్జి తంగమణి

డోన్ టౌన్: ముద్దాయిలు జైలు నుంచి విడుదల అయిన తర్వాత సమాజంలో సత్ప్రవర్తనతో మెలగాలని సీనియర్ సివిల్ జడ్జి తంగమణి సూచించారు. పట్టణంలోని సబ్ జైలును శనివారం ఆమె తనిఖీ చేశారు. స్టోర్ రూం, ముద్దాయిలకు అందిస్తున్న భోజనాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం న్యాయవిజ్ఞాన సదస్సులో పాల్గొని ముద్దాయిలను ఉద్దేశించి మాట్లాడారు. దొంగతనం కేసులో పట్టుబడినవారి వివరాలు, ఫొటోలు పోలీస్ స్టేషన్‌లలో ఉంటాయన్నారు. సారాయి కేసులో పట్టుబడి పదేపదే జైలుకు రావడం వలన క్రమంగా కుటుంబ సభ్యులకు దూరం కావాల్సి వస్తుందన్నారు. నేర ప్రవృత్తిని విడనాడి పిల్లలను ఉన్నత చదువులు చదివించి వారి అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ రఘునాథ్ రెడ్డి, లీగల్ ఎయిర్ కౌన్సిల్ సభ్యులు నరసింహుడు, మాధవస్వామి, సరిత తదితరులు పాల్గొన్నారు.

రసాయన ఎరువుల వాడకం తగ్గించాలి


పొలంబడి నిర్వహిస్తున్న వ్యవసాయ అధికారులు

అవుకు: రైతులు సాగులో వీలైనంత వరకు రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించాలని అవుకు మండల వ్యవసాయ అధికారి ప్రసాద్ రావు సూచించారు. శనివారం మండల పరిధిలోని కొండమనాయునిపల్లె గ్రామంలో సాగు చేసిన వేరుశనగ పంటపొలంలో పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ రసాయన ఎరువుల వాడకం వలన క్రమేనా భూమిలో సారం తగ్గిపోతుందని, దీంతో దిగుబడులు తగ్గిపోయే ప్రమాదం ఉందన్నారు. పురుగు మందుల వాడకాలను తగ్గించి వేరుశనగలో సస్యరక్షణ చర్యలు పాటించాలని, సేంద్రీయ, పకృతి వ్యవసాయ పద్ధతులను అవలంబించాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో వీఏఏ శారద, గ్రామ రైతులు పాల్గొన్నారు.

రేపు చిరుధాన్యాల వినియోగంపై అవగాహన సదస్సు

బనగానపల్లె: పట్టణంలోని జీఎంఆర్ ఫంక్షన్‌హాల్‌లో సోమవారం చిరుధాన్యాల వినియోగంపై అవగాహన సదస్సు ఏర్పాటు చేస్తున్నట్లు కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే) ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ ధనలక్ష్మి తెలిపారు. కేవీకే, సత్వ మిల్లెట్స్, ఫుడ్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి ప్రముఖ స్వతంత్ర ఆరోగ్యశాస్త్ర వేత్త పద్మ శ్రీ డాక్టర్ ఖాదర్ వలీతోపాటు ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి హాజరవుతారన్నారు.

వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించాలి


కరపత్రాలను ఉపాధ్యాయులకు పంపిణీ చేసిన ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

బనగానపల్లె: వైఎస్సార్‌సీపీకి బలపరిచిన రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూసరవీంద్రారెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి రామచంద్రారెడ్డికి ఓటు వేసి మంచి మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కళాశాల, రవికిరణ్ పబ్లిక్ స్కూల్, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, కంకర గురెడ్డి, ఎస్‌వీ డిగ్రీ, జూనియర్ కళాశాలలు, ధాత్రీ పబ్లిక్ స్కూల్‌లో ఎమ్మెల్యే కాటసాని ఎన్నికల ప్రచారం చేశారు. ఆయా కళాశాలు, పాఠశాలల్లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే కాటసాని మాట్లాడారు. వైఎస్సార్ ప్రభుత్వం విద్యాభివృద్ధికి అత్యధిక ప్రాధనిచ్చిందన్నారు. నాడు-నేడు పథకం కింది ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చామని, విద్యార్థుల హాజరు శాతం పెరిగిందన్నారు. అంతేకాకుండా ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియంను తీసుకొచ్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కు దక్కిందన్నారు. ఉపాధ్యాయుల దీర్ఘకాలిక సమస్యలుగా ఉన్న సీపీఎస్ రద్దు, పాతపెన్షన్ విధానం అమలు తదితర సమస్యలు పరిష్కారానికి రామచంద్రారెడ్డి ఎంతో కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. అదేవిధంగా పట్టభద్రుల వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూసరవీంద్రారెడ్డి గత 25 సంవత్సరాలుగా అనేక ఉద్యమాల్లో పాల్గొనడం జరిగిందన్నారు. హైకోర్టు న్యాయవాదిగా నిరుద్యోగ ఉద్యోగుల కేసులను వాధించి పేదల న్యాయవాదిగా పేరుతెచ్చుకున్నారని వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు డాక్టర్ మహమ్మద్‌హుస్సేన్, ఎమ్మెల్యే అభ్యర్థి నియోజకవర్గ కన్వీనర్ శ్రీనివాసులు, నారాయణ, సుధాకర్, కేజీఆర్ విద్యాసంస్థ అధినేత కంకర రామచంద్రారెడ్డి, ఎస్‌వీ విద్యాసంస్థల అధినేత మునిస్వామిరెడ్డి, రవికిరణ్ పబ్లిక్ స్కూల్ డైరెక్టర్లు హరికృష్ణారెడ్డి, సుధాకర్‌రావు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ స్వర్ణలతాదేవి తదితర అధ్యాపకులు, ఉపాధ్యాయనీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కోవెలకుంట్ల: పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డిని గెలిపించాలని వైఎస్సార్‌సీ ఎస్టీసెల్ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసనాయక్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం మండలంలోని జోళదరాశి, భీమునిపాడు, కంపమల్ల, అమడాల గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 13న జరిగే ఎన్నికల పోలింగ్‌లో రవీంద్రారెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని పట్టభద్రులను కోరారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల నాయకులు లోకేశ్వరరెడ్డి, పోతం రామ్మోహన్‌రెడ్డి, వీరారెడ్డి, అమడాల శంకరయ్య, సుధాకర్, దశరథ రామిరెడ్డి, హర్ష తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

బ్లేడ్ బ్యాచ్ అరెస్టు

డోన్ రూరల్ : మూడు రోజుల క్రితం డోన్ పాతబస్టాండ్‌లో ఒక మూగవ్యక్తితోపాటు శేఖర్ అనే వ్యక్తులను విచక్షణా రహితంగా బ్లేడ్‌లతో కోసి గాయపరిచిన బ్లేడ్ బ్యాచ్‌ని శనివారం పట్టణ సీఐ శేషయ్య ఆధ్వర్యంలో అరెస్టు చేశారు. ఈ మేరకు పోలీస్ స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో సీఐ వివరాలు వెల్లడించారు. తప్పించుకొని తిరుగుతుండగా కొత్తపేటకు చెందిన చిలకల మురాకుమార్‌రెడ్డి, కొండపేటకు చెందిన ఘడిగే లక్ష్మినరసింహలను డోన్ పట్టణంలో అరెస్టు చేశామన్నారు. వీరి నుంచి రెండు బ్లేడ్‌లు కూడా స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఎవ్వరైనా తాగి రోడ్లపైన ఇష్టం వచ్చినట్లు తిరిగితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో ఎస్ఐ నగేష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

దంపతులకు గాయాలు

కోవెలకుంట్ల: కోవెలకుంట్ల- అవుకు ఆర్‌అండ్‌బీ రహదారిలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో దంపతులు గాయపడ్డారు. స్థానికులు అందించిన సమాచారం మేరకు అవుకు మండలం సంగపట్నానికి చెందిన షఫీ భార్య నజీ మున్నీసా గర్భవతి కావడంతో వైద్య పరీక్షల నిమిత్తం బైక్‌పై ఆళ్లగడ్డకు వెళ్లారు. తిరిగి స్వగ్రామం వెళుతుండగా సంజామల మండలం ఆల్వకొండ క్రాస్ సమీపంలో బైక్ అదుపుతప్పి కింద పడ్డారు. క్షతగాత్రులను కోవెలకుంట్ల ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. ప్రాథమిక వైద్యం అనంతరం నజీమున్నీసాను మెరుగైన వైద్యం కోసం నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

సారా విక్రేతల అరెస్టు

డోన్ రూరల్ : పట్టణం సమీపాన గుత్తి రోడ్డులో ఉన్న వ్యవసాయ మార్కెట్ యార్డు వద్ద శనివారం అక్రమంగా నాటు సారా అమ్ముతుండగా ఎనిమిది మందిని అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. కొత్తపేటకు చెందిన వడ్డే రఘు, చిగురుమాన్‌పేటకు చెందిన దూదేకుల షేక్షావలి, పాతపేటకు చెందిన షేక్ మహబూబ్, కొండపేటకు చెందిన ముక్కెంరవి, సందు హరిక్రిష్ణ, బోయ సాయికుమార్, కొత్తపేటకు చెందిన గోగుల పవన్‌కుమార్, తారకరామనగర్‌కు చెందిన కావేటి లోకేష్‌ను అరెస్టు చేశామన్నారు. వీరి నుంచి 40లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు పోలీసులు వివరించారు.

వెన్నపూస రవీంద్రారెడ్డికి మద్దతుగా ప్రచారం


నక్కవాగుపల్లెలో ప్రచారం చేస్తున్న మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు, నాయకులు

డోన్ : వైఎస్సార్‌సీపీ పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డిని గెలిపించాలని రాష్ట్ర మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు ఓటర్లను కోరారు. ఈ మేరకు శనివారం మండలంలోని వెంకటాపురం, గుమ్మకొండ, నక్కవాగులపల్లె, అబ్బిరెడ్డిపల్లె గ్రామాలలో పట్టభద్రులను కలిసి రవీంద్రారెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు బద్దల రాజ్‌కుమార్, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ మల్లెంపల్లె రామచంద్రుడు, వ్యవసాయ సలహామండలి మండల కమిటీ చైర్మన్ చంద్రన్న యాదవ్, నాయకులు సుధాకర్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

రవీంద్రారెడ్డిని గెలిపించాలి


కొలుములపల్లెలో ప్రచారం చేస్తున్న ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి

బేతంచెర్ల: పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల నియోజకవర్గానికి వైఎస్సార్‌సీపీ తరపున పోటీ చేస్తున్న వెన్న పూస రవీంద్రారెడ్డి ని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని మండల కేంద్రం బేతంచెర్లతో పాటు గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు శనివారం ప్రచారం నిర్వహించారు. గూటుపల్లె, కొలుములపల్లె, బలపాలపల్లె, రహిమానుపురం, తవిసి కొండ, హుసేనాపురం, నాగమల్లకుంట గ్రామాల్లో ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, వాల్మీకి ఫెడరేషన్ రాష్ట్ర డైరెక్టర్ మురళీ కృష్ణ, మద్దిలేటిస్వామి ఆలయ చైర్మన్ రామచంద్రుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు బాబుల్ రెడ్డి, బుగ్గన చంద్రారెడ్డి, గూని నాగరాజు, ఎద్దులన్న,గోరుమానుకొండ సర్పంచ్ వెంకటేశ్వర్లు స్థానిక నాయకులతో కలిసి ప్రచారం చేశారు. అదేవిధంగా పట్టణంలోని 2,3 వార్డులో నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి, వార్డు కౌన్సిలర్ చింతల నాగిరెడ్డి, వెఎస్సార్‌సీపీ నాయకులు ఖాజా, డక్కి శేఖర్, నూర్ కమాల్, అజామ్, మధు సూధన్ రెడ్డి ప్రచారం చేశారు.

చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి

కోవెలకుంట్ల: విద్యార్థినీ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని ఎంఈఓ తిమ్మారెడ్డి సూచించారు. పట్టణంలోని సెయింట్ జోసఫ్స్ పాఠశాలలో శనివారం ఇయర్‌ఆఫ్ ద స్టూడెంట్స్ ఎక్సె లన్స్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ విద్యా సంవత్సరంలో చదువుతోపాటు వివిధ క్రీడల్లో రాణించిన విద్యార్థులకు మెడల్స్, షీల్డ్స్, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంఈఓ మాట్లాడుతూ విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించి భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎం లలితా శ్యామల, కరస్పాండెంట్ జాన్‌మేరీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన ఉండాలి

బనగానపల్లె: విద్యార్థులు చట్టాల అవగాహన ఉండాలని బనగానపల్లె బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జగన్నాథ్‌రెడ్డి సూచించారు. శనివారం సాయంత్రం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని న్యాయ విజ్ఞాన సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థినీ, విద్యార్థులకు చట్టాలపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం మహిళ కోసం అమలు చేస్తున్న చట్టాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మహిళా చట్టాలను న్యాయవాదులు అజాంహుస్సేన్, రఘురామిరెడ్డి, నరసింహారెడ్డి, అల్లావుద్దీన్‌లు వివరించారు.

పాల బోనస్ పంపిణీ

బనగానపల్లెరూరల్: విజయడెయిరీ బనగానపల్లె యూనిట్ పరిధిలోని పలు గ్రామాల్లో పాడి రైతులకు అందిస్తున్న బోనస్‌ను డెయిరీ మేనేజర్ మధుసూదన్‌బాబు శనివారం పంపిణీ చేశారు. యనకండ్ల గ్రామంలోని మధుశేఖర్ కేంద్రంలోని 34 మంది రైతులకు రూ.76,500లు, రోషిరెడ్డి సెంటర్‌లోని ఆరుగురు రైతులకు రూ.34వేలు, సుబ్రహ్మణ్యం సెంటర్‌లోని 25 మంది రైతులకు రూ.24500, నందవరం గ్రామంలోని ఎస్తేరమ్మ సెంటర్‌లోని 20 మంది రైతులకు రూ.22272, జయరాజ్ సెంటర్‌లోని 15 మంది రైతులకు సంబంధించి రూ.12150 చొప్పున అందజేశారు.